# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

2. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

3. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.

4. ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరం - కాకినాడ పోర్ట్ మధ్య నడిచే తాత్కాలిక ప్రత్యేక రైలును.. శాశ్వత సర్వీస్‌గా మార్పు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న భారత విలేకర్ల సంఘం -ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మీడియాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిరోజూ వార్తలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అక్రిడేషన్లు, వెల్ఫేర్ ఫండ్ వంటి చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

హైదరాబాద్ లో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-

2026' పేరిట నిర్వహిస్తున్న శాసన సభ్యుల క్రీడా పోటీలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, శాసన సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రహదారి ప్రమాదాల నివారణకు, ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖ, అగ్నిమాపక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టోల్‌ప్లాజాలు, చెక్‌పోస్టులు సహా మొత్తం 16 కీలక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన 236 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ఇకపై ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా దేశంలో ఇంధన సరఫరాలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పశ్చిమాసియా పరిస్థితుల పర్యవేక్షణకు ఏర్పాటైన కేంద్ర మంత్రుల బృందం రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత నిన్న ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పూరి, జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్, కె. రామ్మోహన్ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇంధన సరఫరా, నిత్యావసర వస్తువుల లభ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారతదేశ ఇంధన సరఫరా గొలుసును బలోపేతం చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరం – కాకినాడ పోర్ట్ మధ్య తాత్కాలికంగా నడుస్తున్న ప్రత్యేక రైలును ఇకపై శాశ్వత సర్వీస్‌గా మార్పు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఇప్పటివరకు ప్రత్యేక రైలుగా నడుస్తున్న ఈ రైలు, ఇక నుంచి 67301, 67302 నంబర్లతో రాజమహేంద్రవరం –– కాకినాడ పోర్ట్ MEMU ఎక్స్‌ప్రెస్‌గా శాశ్వత ప్రాతిపదికన నడపనున్నట్లు రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మార్పునకు ఆమోదం తెలిపినందుకు పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాజమహేంద్రవరం, కాకినాడ మధ్య రాకపోకలు సాగించే వేలాది మంది రోజువారీ ప్రయాణికులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయడం శుభపరిణామమని ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానంపై ఆయన నిన్న ఒక వీడియో సందేశం ద్వారా స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి సహకారం అందిస్తోందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతితో పాటు విశాఖపట్నం, తిరుపతి కేంద్రంగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని బంగారుపాళ్యం మండలంలో తిరుపతి – బెంగళూరు జాతీయ రహదారిపై శేషాపురం వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. బెంగళూరు నుంచి తిరుమలకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఈ ఘటనలో మృతులు తెలంగాణలోని వరంగల్‌కు చెందిన వారిగా గుర్తించామని అధికారులు తెలిపారు.

-----------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ –ఐ. పి. ఎల్. 19వ సీజన్ నిన్న బెంగళూరులో ప్రారంభమైంది. ఎం.చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మొదటి మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై 6 వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు గెలుపొందింది. తొలుత టాస్ గెలిచిన ఆర్‌సీబీ బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. అనంతరం 202 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బెంగళూరు 15.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ రోజు ముంబై వేదికగా ముంబై ఇండియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది.

-----------------------------

తెలంగాణలో చిన్నారుల కోసం నాణ్యమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు అల్పాహారం పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని నిన లాంఛనంగా ప్రారంభించారు. వండుకోవడానికి సిద్ధంగా ఉన్న ఆహారం ఉప్మా, కిచిడీ మిశ్రమాన్ని అల్పాహారం కింద ప్రభుత్వం అందించనుంది.

-----------------------------

దక్షిణ అంతర కర్ణాటక పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల మేర విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాం నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, దీంతో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

తెలంగాణాలోనూ రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

=====================